# సాక్షి
## జోగుళాంబ గద్వాల

బుధవారం ၊ 27 ၊ సెప్టెంబర్ ၊ 2023






### యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

జడ్చర్ల శివారులోని గుట్టల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



### 22న ఎడ్యుకేషన్ ఫెయిర్

వచ్చేనెల 22న ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /22.6

### వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ప్రధాని మోదీ సభను విజయవంతం చేద్దాం

**అయిజ:** ప్రధాని నరేంద్రమోదీ బహిరంగసభను విజయవంతం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ సమీపంలో అక్టోబర్ 1న మధ్యాహ్నం జరిగే సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, జిల్లా కార్యదర్శి స్వప్న, అధికార ప్రతినిధి రాజగోపాల్, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బలరాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి పాల్గొన్నారు.

### రూ.లక్ష పలికిన వినాయకుడి లడ్డూ

**శాంతినగర్:** వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో డ్రైవర్స్, ఓనర్స్, లైట్ మోటారు వెహికల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూకు తొమ్మిదో రోజు మంగళవారం వేలం నిర్వహించారు. మొదటి లడ్డూను రియల్ ఎస్టేట్ సంఘం నాయకుడు మహేష్‌యాదవ్ రూ.1,00,116కు దక్కించుకోగా.. రెండోలడ్డూను పాదరక్షల దుకాణం యజమాని మధు రూ.42 వేలకు కైవసం చేసుకున్నారు. వేలం పాటలో లడ్డూలు దక్కించుకున్న వారిని మేళతాళాలతో రాయచూర్ ప్రధాన రహదారిపై ఊరేగించి ఇళ్ల వద్దకు చేర్చారు.

### అవయవదానానికి ముందుకురావాలి

**గద్వాల క్రైం:** ప్రతి ఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి డా. శశికళ కోరారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవయవ దానం అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మరణానంతరం అవయవాలు మట్టిలో కలిసిపోకుండా అంపశయ్యంపై ఉన్న వ్యక్తికి జీవనధారంగా ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవయవదానం చేసేవారు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. సిద్దప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కు షాక్..!

**కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్సీ కసిరెడ్డి?**

- అనుచరులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు నిర్ణయం
- ఈ నెల 29 లేదా 30న చేరే అవకాశం
- 'కల్వకుర్తి'లో మారనున్న రాజకీయ సమీకరణలు



**సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:** భారత రాష్ట్ర సమితికి షాక్ తగలనుంది. ఉమ్మడి పాలమూరుకు చెందిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి త్వరలో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారు. తాజాగా ఇటీవల రాజకీయపరంగా చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఆశించిన ఆయనకు ఈ సారి సైతం భంగపాటే ఎదురైన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కసిరెడ్డికి తొలి నుంచీ విభేదాలు ఉన్నాయి. తనతో పాటు తన వర్గానికి చెందిన నాయకులకు పార్టీలో ప్రాధాన్యం దక్కకపోవడం.. ఈసారి సైతం జైపాల్‌కే అధిష్టానం మద్దతు పలుకుతుండడంతో ఇన్నాళ్లుగా వేచి చూసే ధోరణిని అవలంబించిన కసిరెడ్డి తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 29న లేదంటే 30న ఆయన కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ పరిణామం 'గులాబీ'కి పెద్ద దెబ్బగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**నాలుగైదు దఫాలుగా పెద్దల రాజీ యత్నాలు**

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ అన్ని పార్టీల కంటే ముందుగా అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. అన్ని సీట్లను సిట్టింగ్ ఎమ్మెల్యేలకే కేటాయించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రాజకీయ పరిణామాల క్రమంలో పలు నియోజకవర్గాల్లో అసమ్మతి స్వరాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా కల్వకుర్తి నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను మార్చాలంటూ అసమ్మతి నేతలు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ నిరసన గళం వినిపించారు. దీంతో రంగంలోకి దిగిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కసిరెడ్డితో పాటు అసమ్మతి నేతలతో గత నెల చివర నుంచి ఇప్పటివరకు నాలుగైదు పర్యాయాలు సంప్రదింపులు జరిపి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కసిరెడ్డి ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ అపాయింట్‌మెంట్ సైతం తీసుకున్నా.. అనివార్య కారణాలతో రద్దయినట్లు తెలిసింది. ఆ తర్వాత కేటీఆర్ సోమవారం రాత్రి కసిరెడ్డిని స్వయంగా పిలిపించుకుని.. 'తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దు.. టికెట్ కేటాయింపుపై సీఎంతో మాట్లాడుతాను.. మూడు రోజులు ఓపిక పట్టండి' అని నచ్చజెప్పేందుకు యత్నించినట్లు సమాచారం. అయితే కసిరెడ్డి వర్గానికి చెందిన అనుచరులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఉన్న ఆయన నివాసంలో మంగళవారం భేటీ అయి ఆయనపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చినట్లు వినికిడి. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ.. తనతో పాటు తనను నమ్ముకున్న వారిని ఇబ్బంది పెట్టొద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

**రాజకీయ నేపథ్యం..**

కసిరెడ్డి 2014లో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన అదే సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ టికెట్‌ను ఆశించారు. టికెట్ రాకపోవడంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. 2016లో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్)లో చేరారు. ఇదే సంవత్సరంలో జరిగిన శాసన మండలి ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కల్వకుర్తి నుంచి టికెట్ ఆశించినా.. దక్కలేదు. అనంతరం 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రెండోసారి ఆయన ఎన్నికయ్యారు.

**'కల్వకుర్తి'లో మారనున్న సమీకరణలు..**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కసిరెడ్డి కాంగ్రెస్‌లో చేరనుండడంతో కల్వకుర్తి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు రసవత్తరంగా మారాయి. కాంగ్రెస్ నుంచి కల్వకుర్తి అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి పేరు ఇన్నాళ్లుగా వినిపిస్తూ వచ్చింది. అయితే ఆయన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉండడంతో ఆయన సేవలను ఢిల్లీ స్థాయిలో వినియోగించుకోవాలని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతూ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను జల్లెడ పడుతున్న అధిష్టానం కల్వకుర్తిపై ఎప్పటి నుంచో నజర్ వేసింది. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి రంగంలోకి దిగడంతో పాటు కసిరెడ్డికి టికెట్‌పై హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన హస్తం గూటికి చేరేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. ఈ పరిణామాలు కల్వకుర్తితో పాటు పలు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు చేటు తెస్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## త్వరితగతిన పంట రుణమాఫీ ప్రక్రియ



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల రూరల్:** రైతులకు సంబంధించిన పంట రుణమాఫీ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంట రుణాల పునరుద్ధరణను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా మాఫీ డబ్బులను జమచేసే క్రమంలో కొన్ని ఖాతాలు పనిచేయకపోవడం, అప్పటికే రైతులు తీసుకున్న రుణాలు చెల్లించడం, కొందరు మరణించడం తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని.. రెండురోజుల్లో పూర్తిచేయాలన్నారు. పీఎంఎఫ్ఎంఈ, ముద్ర రుణాలకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా లబ్ధిదారులకు మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో డీఏఓ గోవిందునాయక్, యూబీఐ ఆర్ఎం సత్యనారాయణ, ఏపీజీ రంజిత్‌కుమార్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి పాల్గొన్నారు.

### పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో
## 30 గంటల సత్యాగ్రహం

**పాలమూరు:** ఉమ్మడి జిల్లాలో ఉన్న నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2, 3వ తేదీలలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట 30గంటల సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లుగా జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని, తెలంగాణకు న్యాయంగా పంపిణీ చేయాల్సిన కృష్ణా నీటిని ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం జాతీయ పథకంగా చేపట్టి పాలమూరు జిల్లాను కరవు, వలసలు నివారించేందుకు చర్యలు తీసుకుంటామని సుష్మా స్వరాజ్, అమిత్ షా, స్వయంగా నరేంద్ర మోదీలు హామీ ఇచ్చానా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. ముఖ్యమంత్రి మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాలేదని విమర్శించారు. నీళ్లు ఏరులై పారాల్సిన చోట మద్యం ఏరులై పారుతుంటే ఈ ప్రభుత్వం సిగ్గుపడటం లేదని మండిపడ్డారు. అక్టోబర్ 2న ఉదయం 10.30గంటల నుంచి 3న సాయంత్రం 4.30గంటల వరకు జరిగే ఈ సత్యాగ్రహ శిబిరానికి ప్రజాస్వామిక వాదులు, పా ర్టీల నేతలు, సంఘాల నాయకులు, విద్యావంతులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 'విజయవర్ధిని' పునరుద్ధరణకు చర్యలు



మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ రామకృష్ణారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే అబ్రహం

- తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సంస్థ రాష్ట్ర చైర్మన్ రామకృష్ణారెడ్డి

**అలంపూర్:** బీచుపల్లి విజయవర్ధిని ఆయిల్ పరిశ్రమ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలంగాణ ఆయిల్‌ఫెడ్ సంస్థ రాష్ట్ర చైర్మన్ కంచెర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వీఎం అబ్రహంను ఆయిల్‌ఫెడ్ చైర్మన్‌తోపాటు మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, రాష్ట్ర ఫీల్డ్ మార్కెటింగ్ మేనేజర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా అక్టోబర్ 3న విజయవర్ధిని ఆయిల్‌ఫెడ్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అనంతరం రాష్ట్ర చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ కొరతను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ఆయిల్ ప్లాంటేషన్ ఎక్కువగా చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌ఫాం గెలల క్రషింగ్ మిషన్ రాష్ట్రంలోని భద్రాది, కొత్తగూడెంలోనే ఉన్నాయన్నారు. దశల వారీగా వాటి సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. బీచుపల్లిలో వేరుశనగ క్రషింగ్ జరిగేదని, రూ.150కోట్లతో అతిపెద్ద ఆయిల్‌ఫాం క్రషింగ్ మిల్‌గా విజయవర్ధిని మిల్‌ను పునరుద్ధరించనున్నట్లు వివరించారు. ఈ మిల్ ప్రారంభంతో 400 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. మరో వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. విజయవర్ధినిలో గంటకు 30టన్నుల గెలలు, ఒక రోజు 600 టన్నుల ఆయిల్‌ఫాం గెలలను క్రషింగ్ చేసి, క్రూడ్ ఆయిల్‌ను సిద్ధం చేసేవిధంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఖమ్మం, కొత్తగూడెం, సిద్దిపేట తదితర ప్రాంతాల్లో 10వేల ఎకరాల్లో ఆయిల్‌ఫాం సాగు చేశారని, సాగు విస్తీర్ణాన్ని 70వేల ఎకరాలకు పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఆయిల్ కొరతను నివారించడానికి 20లక్షల ఎకరాల్లో సాగు చేసి, ప్రతి జిల్లాలో ఒక ఆయిల్‌ఫెడ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పిస్తోందన్నారు. ప్రస్తుతం ఇక్కడ క్రూడ్ ఆయిల్ తయారు చేస్తే.. సిద్ధిపేటలోని మిల్‌లో ఫిల్టర్ చేసి ప్యాకెట్లుగా తయారు చేస్తున్నట్లు తెలిపారు.

## కోకాపేటలో నా సొంత భూమి

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



స్థలానికి సంబంధించిన పత్రాలను మీడియాకు చూపుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

**అలంపూర్:** హైదరాబాద్‌లోని కోకాపేట భూ వివాదంపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి స్పందించారు. కోకాపేటలో ఉన్న భూమి భూమి తన సొంతం అని తెలిపారు. మంగళవారం ఆయన జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం స్థానిక టూరిజం హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని కోకాపేటలో కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి భూకబ్జా చేసినట్లు కొన్ని మీడియా సంస్థల్లో కథనాలు వచ్చాయన్నారు. కోకాపేటలోని సర్వే నం.85లో 2.30 ఎకరాల భూమి 2013 సంవత్సరంలో కొనుగోలు చేశామన్నారు. తమ కుటుంబంలోని ముగ్గురు పేరిట ఉన్న ఈ భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయన్నారు. తాము కొనుగోలు చేసిన తర్వాతే గోల్డ్ ఫిష్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ వేగేతో భూమి అభివృద్ధి చేయడానికి అగ్రిమెంట్ సంతకం చేసినట్లు వివరించారు. అయితే సదరు సంస్థ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతోపాటు అందుకు సంబంధించి కనీసం జీహెచ్ఎంసీని ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడంతోనే అగ్రిమెంట్ రద్దు చేయాలని 2020లో కోర్టుకు వెళ్లామన్నారు. తమ స్థలంలో ఉన్న కూలీలను వెళ్లగొట్టినట్లు వస్తున్న ప్రచారంలో నిజం లేదని, ఈ స్థలానికి పక్క సైట్‌లో పనులు జరుగుతుండటంతో కూలీలు అక్కడ ఉన్నారన్నారు. పక్క సైట్‌లో పనులు జరుగుతుండటంతో హద్దులు చూసుకోవాలని తన తమ్ముడిని పంపించానని చెప్పారు. భూమికి ఫెన్సింగ్ వేస్తుంటే గోల్డ్ ఫిష్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారని వివరించారు. గోల్డ్‌ఫిష్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ వేగేపై గత 15 ఏళ్లలో 12 క్రిమినల్, 9 సివిల్ కేసులు నమోదయ్యాయని, 2021 ఫిబ్రవరి 25న పీడీ యాక్టు సైతం నమోదవగా.. అదే సంవత్సరంలో తెలంగాణ పోలీసులు అతన్ని కేరళలో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు ప్రస్తుతం ఉన్న సర్వే నం.85కు పక్కనే ఈ సంస్థ డెవలప్ చేస్తున్న స్థలంలో రెండు ఇళ్లు కొనుగోలు చేశామన్నారు. ఇందుకు సంబంధించి మొత్తం డబ్బులు చెల్లించి ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆరోపించారు. దీనిపై కూడా కోర్టుకు వెళ్లామని చెప్పారు. హీరో ప్రభాస్ బంధువు సత్యనారాయణరాజు ఒక ఇల్లు, సంజయ్ కమతం అనే వ్యక్తి రెండు ఇళ్లు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించిన రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో కోర్టుకు వెళ్లారన్నారు. 2017లో తన తమ్ముడు వాళ్ల నాన్న కలిసి రెండు విల్లాలకు అగ్రిమెంట్ చేసుకొని డబ్బులు చెల్లించినా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ తెచ్చుకున్నారన్నారు. ఎంతో మంది దగ్గర భూములు డెవలప్‌మెంట్ చేస్తామని తీసుకొని తర్వాత చీటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. నేను కోర్టుకు వెళ్లడంతో హైదరాబాద్‌కు చెందిన ఒక ఎమ్మెల్యేతో కలిసి కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి వద్దకు మధ్యవర్తిత్వం కోసం వెళ్లారన్నారు. కానీ, హర్షవర్ధన్‌రెడ్డి అదే చంద్రశేఖర్ వేగేకు 2016లో ఇల్లు కొనడానికి డబ్బులు ఇస్తే ఇప్పటి వరకు ఎలాంటి ఇల్లు, డబ్బులు ఇవ్వలేదని, కాబట్టి మధ్యవర్తిగా రాలేనని ఆయన చెప్పారన్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కాబట్టి ఇలాంటి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డారని, దీనిపై కొన్ని మీడియా సంస్థలు నిజాలు తెలుసుకోకుండా తప్పుడు కథనాలు ప్రసారం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బై బై గణేశా..



ఇటిక్యాల మండలం బీచుపల్లి కృష్ణానదిలో మంగళవారం గణనాథుల నిమజ్జనం కొనసాగింది. తొమ్మిది రోజుల పాటు మండపాల్లో నిత్య పూజలందుకున్న వినాయకుడి లడ్డూకు వేలం నిర్వహించి సాయంత్రం నృత్యాలు చేసుకుంటూ వీధుల్లో ఊరేగించి చివరకు కృష్ణానదికి తరలించారు. అనంతరం క్రేను సాయంతో కృష్ణమ్మ ఒడికి చేరార. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు బందోబస్తు నిర్వహించారు.

– ఎరవల్లిచౌరస్తా

## జోరుగా.. హుషారుగా

- ఉత్సాహంగా పర్యాటక దినోత్సవ సంబరాలు
- జిల్లాకేంద్రంలో రెండోరోజు కొనసాగిన సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శనలకు హాజరైన ప్రజలు



పాటలు పాడుతున్న గాయకులు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పాలమూరు మినీ ట్యాంక్‌బండ్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాల జోరు రెండోరోజు మంగళవారం హుషారుగా సాగింది. ట్యాంక్‌బండ్ వద్ద ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేదిక చుట్టూ ఏర్పాటు చేసిన రంగురంగుల లైటింగ్ ఆకట్టుకుంటోంది. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి పట్టణ ప్రజలు మినీట్యాంక్‌బండ్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేదిక ఎదుటతో పాటు బారికేడ్లకు ఇరువైపులా ప్రేక్షకులు నిలబడి సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. పర్యాటక సంబరాలను పురస్కరించుకొని ట్యాంక్‌బండ్‌లోని సస్పెన్షన్ బ్రిడ్జిని రంగురంగుల విద్యుత్‌కాంతులతో అలంకరించారు.

**సింగర్ కృష్ణచైతన్య పాటల హోరు**

సినీ నేపథ్య గాయకుడు కృష్ణచైతన్య బ్యాండ్ పాటలతో ప్రేక్షకులను హోరెత్తించారు. ఓం నమో శివ రుద్రాయ పాట, ఓ రెండు ప్రేమ మేఘాలిల, కొలవెరి, ఏ మేరా జహా, చెలియా చెలియా పాటలు పాడి హోరెత్తించారు. అలాగే గోవింద్, సత్య పాడిన బలగం సినిమాలోని ఊరు.. పల్లెటూరు పాటకు ప్రేక్షకులు చప్పట్లతో సందడి చేశారు. రారా రక్కమ్మ పాటకు కొంతమంది చిన్నారులు స్టేజీపైకి ఎక్కి డాన్స్ చేశారు. మరో సింగర్ స్వాతి నువ్వు కావాలయ్య పాటతో అలరించారు. అలాగే బుల్లెట్ భాస్కర్ టీం చేసిన స్కిట్లు నవ్వులు పూయించాయి. నరేష్, శాంతిస్వరూప్‌లతో చేసిన పలు స్కిట్లు ఆకట్టుకున్నాయి. బుల్లెట్ భాస్కర్ పలు హీరోల వాయిస్‌లను మిమిక్రీ చేసి ప్రేక్షకులను రంజింపజేశారు. సింగర్ సత్య పాడిన ఊ అంటా మావా ఊఊ అంటావా మావా పాటకు కమెడియన్ శాంతిస్వరూప్ చేసిన డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రెండోరోజు కార్యక్రమానికి యాంకర్లు మృదుల, సుమంత్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, డీఈఓ రవీందర్, డీఎఫ్ఓ సత్యనారాయణలు గాయకులు, బుల్లితెర నటులను శాలువాలతో సన్మానించారు.

## పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ



ఉప్పేరులో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

**ధరూరు:** చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మంగళవారం మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని రజక కమ్యూనిటీ భవనంతో పాటు మండలంలోని ఉప్పేరులో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, సీనియర్ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సవారన్న, నాయకులు మోతీలాల్, ఆనంద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాలు, బ్యారం నర్సింహులు, కోటన్న, మాశన్న, సతీష్, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో...**

చాకలి ఐలమ్మ 128వ జయంతిని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


### గొప్ప స్ఫూర్తిప్రదాత..



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల రూరల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ముఖ్యభూమిక పోషించి ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలో ఆమె పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద, అణగారిన వర్గాల కోసం ఉద్యమించిన గొప్ప పోరాటయోధురాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి శ్వేతాప్రియదర్శిని, ఏఓ భద్రప్ప, రజక సంఘం నాయకులు జయశ్రీ, పేపర్ నర్సింహులు, అశోక్, కోట్ల వీరేష్, నాగరాజు, శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

### ఎస్పీ కార్యాలయంలో..




జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సృజన

**గద్వాల క్రైం:** భూ పోరాట యోధురాలు, పేదల తరుపున పెత్తందార్లతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని ఎస్పీ సృజన అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఐలమ్మ 128 జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పేదల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన గుర్తింపు పొందిన మహిళాయోధురాలన్నారు. ఆధిపత్యవాదంపై ఎర్రజెండాతో ఎదురు నిలిచి తన ప్రాణాన్ని లెక్కచేయకుండా ఆయుధాన్ని పట్టిందని గుర్తు చేశారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**అడ్డాకుల:** మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల మేరకు.. మూసాపేటకు చెందిన బంగారు కృష్ణయ్య (42) కూలీ పనులు చేసేవాడు. మద్యానికి బానిసైన అతడు.. తరచూ భార్యను వేధించడంతో తన ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో బెంగళూర్‌కు వలస వెళ్లిన కృష్ణయ్య.. రెండు వారాల కిందట మూసాపేటకు తిరిగొచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున అడ్డాకుల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా కృష్ణయ్య ఎక్కడికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందన్న వివరాలు తెలియాల్సి ఉంది.

### బీచుపల్లి వద్ద మరో వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**ఎర్రవల్లిచౌరస్తా:** జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు.. బీచుపల్లి పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా గుర్తుతెలియని వ్యక్తి (45) భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బీచుపల్లి ఆలయ ముఖద్వారం వద్ద రోడ్డు దాటుతుండగా, కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గద్వాల మార్చురీకి తరలించారు.

### రైతు ఆత్మహత్య

**గట్టు:** భూవివాదంపై మనస్తాపానికి గురైన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన కుర్వ ఉల్లిగడ్డల ఈరన్న కుమారులు, పక్క పొలం రైతులతో కొంతకాలంగా భూవివాదం కొనసాగుతోంది. ఇరువర్గాల వారు భూవివాదంపై సివిల్ కోర్టును ఆశ్రయించారు. మంగళవారం వ్యవసాయ పొలంలో ఈరన్న కుమారులు గుంటికె పాయడానికి వెళ్లగా, పక్క పొలం రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువర్గాలు మాట్లాడుకునేందుకు గ్రామంలోకి చేరుకోగా, పొలంలోనే ఉన్న ఈరన్న (65) పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

### మేడపై నుంచి దూకి వివాహిత..

**ఆత్మకూర్:** మానసిక స్థితి సరిగాలేని వివాహిత మేడపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ వివరాల మేరకు.. పట్టణానికి చెందిన చంద్రకళ, పుల్లారెడ్డి దంపతుల కుమార్తె సారిక (29), గద్వాల జిల్లా కొండపల్లికి చెందిన రాజవర్ధన్‌రెడ్డితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉండగా, నెలరోజులుగా సారిక మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఈనెల 25న పుట్టింటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో మంగళవారం మేడపై నుంచి ఆమె దూకడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందిదని వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### చేనేత కార్మికుడి మృతి


చిన్న ఎల్లప్ప (ఫైల్)

**అయిజ:** పట్టణానికి చెందిన కాకె చిన్న ఎల్లప్ప (89) మంగళవారం మృతి చెందాడు. కలిమిపూల దుప్పట్లు తయారు చేయడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈయన నేసిన దుప్పట్లను వివిధ రాష్ట్రాల ప్రజలు కొనుగోలు చేశారు. ఆయన అంత్యక్రియలు బుధవారం పట్టణంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి


మల్లేష్ (ఫైల్)

**బిజినేపల్లి:** గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఓ యువకుడు డ్యాన్స్ చేస్తూ కిందపడి మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. బిజినేపల్లి మండలం పాలెం సుబ్బయ్యగూడెంకు చెందిన మల్లేష్ (24) సోమవారం అర్ధరాత్రి నిర్వహించిన గణేష్ నిమజ్జనంలో పాల్గొని సహచర యువకులతో డ్యాన్స్ చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి అపస్మారక స్థితిలోకి చేరాడు. వెంటనే స్థానిక యువత గమనించి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మల్లేష్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాములుయాదవ్ తెలిపారు.

# నిమజ్జనానికి ఏర్పాట్లు


కొండారెడ్డిపల్లి చెరువును పరిశీలిస్తున్న నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లు

**నేడు గంగమ్మ ఒడికి చేరనున్న గణనాథుడు**

- శోభాయాత్రకు సర్వసిద్ధం
- పోలీసుల భారీ బందోబస్తు

**మహబూబ్‌నగర్ క్రైం/నారాయణపేట రూరల్:** గణేష్ ఉత్సవాల్లో అతి ప్రధానమైనది విగ్రహ నిమజ్జనం. మేళతాళాలు.. డీజే పాటలు..తీన్మార్ నృత్యాలతో చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొంటారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో ఈసారి భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. 10 రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరనున్నాడు. ఈ సందర్భంగా గణేశ్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో ఎలాంటి అపశ్రుతి చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మహబూబ్‌నగర్‌లో 315మంది, నారాయణపేటలో 300మందితో భద్రతా చర్యలు చేపట్టనున్నారు. మసీదులు, ఆలయాలు వద్ద ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించనున్నారు. అలాగే శోభాయాత్ర దారుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌లోని వివిధ కాలనీల్లో ఉన్న గణనాథులు నిమజ్జనం కోసం ర్యాలీగా క్లాక్‌టవర్ వరకు చేరుకొని, అక్కడి నుంచి హన్వాడ, బీచుపల్లి, రంగాపూర్ తదితర ప్రాంతాలవైపు వెళ్తాయి. ఐదున్నర అడుగులు ఉన్న వినాయకులను తరలించడానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్లాక్ టవర్ వరకు శోభాయాత్ర పూర్తయిన తర్వాత పాలకొండ వద్దనున్న బైపాస్ రోడ్డులో గణనాథులను అప్పగించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ కార్యాలయంతోపాటు స్థానిక మున్సిపల్ మైదానంలో ఐదు శాఖల అధికారులను కలిపి ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

● నారాయణపేటలో గణేశ్ శోభాయాత్రను తిలకించేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. పోలీసులు ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. అన్ని ప్రార్థనా మందిరాలు, ముఖ్యకూడళ్లు, గణేష్ మార్గ్‌లో పోలీసులతోపాటు స్పెషల్ పార్టీ సిబ్బంది మోహరించారు. గణేవ్ మండపాలతోపాటు ఊరేగింపు జరిగే ప్రాంతాలు, నిమజ్జనం చేసే కొండారెడ్డిపల్లి చెరువు, బారంబావి తదితర ప్రాంతాల్లో బాంబ్‌స్కాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. ఎస్పీ వెంకటేశ్వర్లు ఎప్పటికప్పుడు వివరాలను సేకరిస్తూ శాంతియుత వాతావరణంలో నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయడానికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కాగా గణేశ్ నిమజ్జనం సందర్భంగా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈత రాని వారు, ప్రధానంగా చిన్నారులను చెరువుల వద్దకు తీసుకెళ్లొద్దు. తక్కువ లోతు వరకు మాత్రమే వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయాలి. నిమజ్జనం అనంతరం యువత ఈతకు దిగకూడదు. ప్రధానంగా 10–15 ఏళ్ల బాలలను తల్లిదండ్రులు కనిపెట్టుకొని ఉండాలి. లేదా అత్యుత్సాహంతో పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా విద్యుత్ తీగల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

**నిఘా నీడలో నిమజ్జనం..**

గణనాథుల ఊరేగింపు పగటి వేళలో నిర్వహిస్తే ప్రజలు చూడటానికి అవకాశం ఉంటుంది. డీజేలకు అనుమతి లేదు. ఎవరూ ఏర్పాటు చేయరాదు. పాలమూరులో గణేష్ నిమజ్జనానికి 315మంది పోలీస్ సిబ్బందితోపాటు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా బందోబస్తు పర్యవేక్షించబోతున్నాం. మఫ్టీ బృందాలు, స్పెషల్ టీంలు, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని రంగంలోకి దించుతాం. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలి. నిమజ్జనం చేసే ప్రతి చెరువు వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశాం.

– టి.మహేష్ డీఎస్పీ, మహబూబ్‌నగర్

**25 లారీలు ఏర్పాటు..**

మహబూబ్‌నగర్ నుంచి బీచుపల్లి, రంగాపూర్‌లకు నిమజ్జనం కోసం గణనాథులను తరలించడానికి రవాణాశాఖ, లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 వరకు లారీలు ఏర్పాటు చేశాం. ఇంకా అవసరం మేరకు అందుబాటులో ఉంచుతాం. ఇప్పటికే పాలకొండ బైపాస్ వద్ద లారీలు ఏర్పాటుచేశాం. మరీ ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను మండప నిర్వాహకులే స్వయంగా తీసుకువెళ్లాలి. ఒక్కో లారీలో 20నుంచి 30 విగ్రహాలు తరలిస్తాం.

– నరేష్, ఎంవీఐ, మహబూబ్‌నగర్

# 22న అంతర్జాతీయస్థాయి ఎడ్యుకేషన్ ఫెయిర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు
- పోస్టర్ ఆవిష్కరణలో ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ హబ్ (పవర్డ్ బై వన్ విండో) ఆధ్వర్యంలో అక్టోబర్ 22న మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మంత్రి ఫాంహౌస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌కు మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలను ఆహ్వానించి ఉచితంగా ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి విదేశాలకు వెళ్లి చదువుకునేందుకు విద్యార్థులకు చక్కని అవకాశం లభిస్తుందన్నారు. విదేశాల్లో ఎం చదవాలి, ఏఏ విశ్వవిద్యాలయాల్లో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందో తెలుసుకోవడంతోపాటు ఉపకార వేతనాలు మొదలైన సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గుర్తింపు లేని, పెద్దగా ఉపయోగపడని విశ్వవిద్యాలయాల్లో చదివి అనేకమంది విద్యార్థులు తమ భవిష్యత్‌ను వృథా చేసుకుంటున్నారని, అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ ఫెయిర్ వల్ల అలాంటి సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఉన్నత విద్య కోసం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులు హైదరాబాద్ వంటి నగరాల్లో పలు కన్సల్టెన్సీలను ఆశ్రయిస్తారని, అలాంటిది మహబూబ్‌నగర్‌లోనే అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అడిగిన వెంటనే ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ హబ్ నిర్వాహకులు ఇక్కడ 20కిపైగా అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎడ్యుకేషన్ ఫెయిర్ ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. దసరా సెలవుల్లో ఏర్పాటు చేస్తున్న ఈ సదస్సును హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకునాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ హబ్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్లు వినయ్‌కుమార్, అంకిత్ జైన్ పాల్గొన్నారు.

# హైకోర్టు ఉత్తర్వులను అమలు పర్చాలి

- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సయ్య

**నారాయణపేట:** హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఊట్కూర్ మండలం వల్లంపల్లి శివారు సర్వే నంబర్ 48/2లోని ఇంటి స్థలాలను లబ్ధిదారులకు అప్పగించాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వల్లంపల్లి గ్రామ శివారులోని 15 ఎకరాల భూమిని పేదలకు ఇంటి స్థలాల నిమిత్తం ప్రభుత్వం రెవెన్యూ డివిజనల్ అధికారి ద్వారా ప్రొసీడింగ్ నంబర్ 1/1423/2006తో నారాయణపేటకు చెందిన ఉమాకాంత్ సిద్దప్పతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2007 జనవరి 27న సాంఘిక సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇందిరమ్మ ఇంటి స్థలాలను అప్పగించగా, అప్పటి ఎమ్మెల్యే లబ్ధిదారులకు మంజూరు చేశారన్నారు. లబ్ధిదారులు వాటాధనం చెల్లించినా.. ప్రభుత్వం విద్యుత్, తాగునీటి, రోడ్ల సౌకర్యం కల్పించలేదన్నారు. ప్రస్తుతం ఇంటి స్థలాల నుంచి లబ్ధిదారులను ఖాళీ చేయించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించారని, కేసు విచారణలో ఉండగానే స్థలాన్ని పోలీస్ కాంప్లెక్స్‌కు అప్పగించారన్నారు. దీంతో లబ్ధిదారులు రిట్ పిటిషన్ వేయగా.. కోర్టు పరిశీలించి, లబ్ధిదారులకు అనుకూలంగా తీర్పునిచ్చిందన్నారు. అయినప్పటికీ అధికారులు లబ్ధిదారులను భయాందోళనకు గురిచేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ స్థలాన్ని మరోమారు స్టేడియం నిర్మాణానికి అప్పగించినట్లు అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హైకోర్టు ఉత్తర్వులను గౌరవించి, పేదలకు ఇంటి స్థలాలు అప్పగించాలని కోరారు. ప్రజాపంథా నాయకులపై పోలీసులు పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. మైనార్టీ కాలనీ, చిట్టెం నర్సిరెడ్డి కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు అసవరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో రాయల చంద్రశేఖర్, కె.కాశీనాథ్, కృష్ణ, హన్మేష్, బి.రాము ఉన్నారు.

# వ్యర్థాలతో వాగు నీళ్లు కలుషితం


ఊకచెట్టు వాగును పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

- చిత్తనూర్ ఇంథనాల్ ఆయిల్ కంపెనీపై చర్యలు చేపట్టాలి
- డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

**చిన్నచింతకుంట:** చిత్తనూర్ ఇంథనాల్ ఆయిల్ కంపెనీ వ్యర్థాలతో ఊకచెట్టు వాగు నీళ్లు కలుషితమవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రం సమీపంలోని ఊకచెట్టు వాగును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఇంథనాల్ ఆయిల్ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థాలను పక్కనే ఉన్న మన్నెవు వాగులోకి వదలుతుండడంతో ఊకచెట్టు వాగులోకి కలుషిత నీళ్లు చేరుతున్నాయన్నారు. దీంతో వాగులోని చేపలతోపాటు జీవరాశులు మృతి చెందుతున్నాయన్నారు. ఇది ఇలాగే కొనసాగితే పరిసర ప్రాంత ప్రజలకు తాగు, సాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. వాగుల్లో నీటిని కలుషితం చేస్తున్న ఇంథనాల్ ఆయిల్ కంపెనీపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్ల సమ్మెకు మద్దతు ప్రకటించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ఎస్.వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, జాకీర్, వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.

### వరకట్న వేధింపుల కేసులో జైలుశిక్ష

**గోపాలపేట:** వరకట్నం కోసం భార్యను వేధించిన భర్తకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ వనపర్తి రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. మండలంలోని చాకలిపల్లికి చెందిన బాధితురాలికి, మక్తల్ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన వెంకటేష్‌తో కొన్నాళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా వెంకటేష్ తన భార్యను అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడంతోపాటు రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయంపై బాధిత మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ మేరకు ఏపీపీ సునీత, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌నాయక్ సహాయంతో వనపర్తి రెండో అదనపు కోర్టులో వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం వెంకటేష్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి జానకి తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు.

### ఇద్దరికి రిమాండ్

**అమ్రాబాద్:** చుక్కల దుప్పిని హతమార్చిన కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌ఓ ప్రభాకర్ తెలిపారు. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ బీకే తండాకు చెందిన దేశావత్ గోపాల్, దేశావత్ ధర్మతోపాటు గంటల సోమ్లా, సేవ్య తమ పంట పొలాల్లో విద్యుత్ వైర్లు అమర్చి చుక్కల దుప్పిని చంపారు. గత శుక్రవారం తెల్లవారుజామున దుప్పి చర్మం వలుస్తుండగా, అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం మంగళవారం దేశావత్ గోపాల్, ధర్మలను కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు. గంటల సోమ్లా, సేవ్యలను స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# పట్టపగలే ఇంట్లో చోరీ

- 5 తులాల బంగారం, భూముల డాక్యుమెంట్లు అపహరణ

**మరికల్:** మండల కేంద్రంలోని ఓ ఇంట్లో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సుజాత కుటుంబ సభ్యులు సోమవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు.. ఇంటి తాళాన్ని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న 5తులాల బంగారం ఆభరణాలతోపాటు రూ.10వేల నగదు, భూములు, ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను అపహరించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన బాధిత కుటుంబ సభ్యులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం చేరుకొని వేలిముద్రలను సేకరించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అనుమానితులపై నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

# రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈఓ వెంకటేశ్వర్లు

- డీఐఈఓ వెంకటేశ్వర్లు
- ఉత్సాహంగా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

**మహబూబ్‌నగర్ క్రీడలు:** రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లా జట్లు చాంపియన్‌గా నిలవాలని డీఐఈఓ వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా బాలుర ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. క్రీడాకారులను డీఐఈఓ పరిచయం చేసుకున్న అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. నిరంతర సాధనతో క్రీడల్లో విజయం సాధించవచ్చన్నారు. అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపికలకు 82మంది హాజరైనట్లు తెలిపారు. సదాశివాపేటలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా జట్టుకు రాంచరణ్, ఆర్య, శ్రీకాంత్, ఎండీ ఇస్మాయిల్, ఎం.ముఖేష్, సి.శ్రీకాంత్, కె.చరణ్, వెంకటేష్, సురేష్, సిద్ధార్థ, శ్రీరాం, బి.శివ, నితీన్, సందీప్, ఎండీ మసద్, ప్రేంకుమార్, విజయ్‌కుమార్, అఖిలేష్ ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భగవంతాచారి, నర్సింహారెడ్డి, పీడీలు వడెన్న, భానుకిరణ్, బాలరాజు, రామకృష్ణ, రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

# యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- తమకు అడ్డే లేదంటున్న అక్రమార్కులు
- చర్చనీయాంశమైన 'సాక్షి' కథనం
- విచారణకు తహసీల్దార్ ఆదేశాలు


హౌసింగ్‌బోర్డు కాలనీ వెనుకాల గుట్టపై సాగుతున్న తవ్వకాలు

**జడ్చర్ల:** పట్టణంలోని గుట్టల్లో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎవరేం చేస్తారో చూద్దామన్న చందంగా అక్రమార్కులు క్రషర్ యంత్రాలతో బ్లాస్టింగ్‌లు చేసి కొండలను పిండి చేస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన 'కొల్లగొడుతున్నారు' కథనం చర్చనీయాంశంగా మారింది. కొండలు, గుట్టలపై ఉన్న బండరాళ్లను పేల్చేందుకు బ్లాస్టింగ్ చేయడం చట్టవిరుద్ధమేమి కాదని.. గుట్టలను, కొండలను తవ్వి మట్టిని తరలించడం అక్రమమేమి కాదని అక్రమార్కులు పలువురితో చెప్పుకొచ్చారు. తమ రాజకీయ పలుకుబడి ముందు చట్టాలు చుట్టాలేనంటూ వ్యాఖ్యానించడం వారి అహంకారానికి నిదర్శనంగా నిలుస్తోంది. తమ వెనుక పెద్ద సారే ఉన్నారని.. అన్నీ ఆయనకు చెప్పే చేస్తున్నామని.. అనుమతులు గినుమతులు తమకు అక్కర్లేదని బహిరంగంగా చెప్పడంపై ప్రజలు ఔరా అనుకుంటున్నారు. అక్రమార్కులకు అండదండగా ఉన్న ఆ పెద్ద సారు ఎవరన్న దానిపై గుసగుసలు మొదలయ్యాయి.

**ఉలుకూ పలుకు లేని మైనింగ్‌శాఖ..**

మైనింగ్‌శాఖ అధికారులు ఉలుకూ పలుకు లేకుండా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎక్కడికక్కడ గుట్టలు, కొండలను కొల్లగొడుతున్నా ఎంత మాత్రం పట్టించుకోకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. మైన్స్ అధికారులను తాము మేనేజ్ చేశామన్న అక్రమార్కుల వ్యాఖ్యలకు ఊతమిచ్చినట్లుగా వారి వ్యవహారశైలి ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్టలను అక్రమంగా తవ్వుతున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**టిప్పర్ స్వాధీనం..**



పేలుడు పదార్థాలను వినియోగించి బ్లాస్టింగ్ చేయడంతో పాటుగా మట్టి తవ్వకాలు జరుపుతున్న గుట్టలను పరిశీలించి, విచారించాల్సిందిగా స్థానిక సీఐ రమేష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ చంద్రమోహన్ మట్టి టిప్పర్లలో ఒక దానిని జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అక్రమంగా బ్లాస్టింగ్ చేయడం, గుట్టలను కొల్లగొట్టడం, మట్టిని తరలించడంపై తమకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

**విచారణకు ఆదేశించాం..**

గుట్టల్లో అక్రమంగా తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నట్లు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించాం. రెవెన్యూ సిబ్బంది ఇచ్చే నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, తహసీల్దార్

# జూరాలకు 26,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**ధరూరు:** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద మరింత పెరిగింది. మంగళవారం రాత్రి 7గంటల వరకు 26,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 30,452, ఆవిరి రూపంలో 95, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులతో కలిపి మొత్తం 33,058 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.275 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

**8 యూనిట్లలో విద్యుదుత్పత్తి**

**ఆత్మకూర్:** జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. మొత్తం 8 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. కర్నాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి వరద చేరుతుండడంతో ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, 90.041 ఎంయూ, దిగువలో 4 యూనిట్ల ద్వారా 160 మెగావాట్లు, 97.369 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపడుతున్నామన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 187.410 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించామని తెలిపారు.

**శ్రీశైలం @ 854.4 అడుగులు..**

**దోమలపెంట:** శ్రీశైలం జలాశయంలో మంగళవారం 854.4 అడుగుల వద్ద 90.3480 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 20,452, సుంకేసుల నుంచి 4,446తో కలిపి మొత్తం 24,898 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. పోతిరెడ్డిపాడు ద్వారా 2వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,503, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.251 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి, 458 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 76 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.